# గాజులాయన

శ్రీ ము. కృష్ణమూర్తి పట్నాయక్

"గాజులమ్మో గాజులూ!... నలుపు, తెలుపు, ఎఱుపు, మెఱుపు, పసుపు, పచ్చ, నీలి, వసంతం... రకరకాలు! తళుక్ తళుక్‌మనే అంద చందాలు!"

మధ్యాహ్నం-సూర్యుడు అగ్ని వర్షిస్తూన్న సమయంలో వీధుల్లో మనుష్యసంచారంలేని సమయంలో-ఇళ్ళల్లో స్త్రీలు యింటి పనిపాటుల్ని పూర్తిచేసి విశ్రాంతి తీసుకుంటూన్న సమయంలో-రెండు చిన్న బెత్తు పెట్టెల్ని కావడిలో పెట్టి అందులో గాజుల్ని అమర్చి భుజంమీద వేసుకొని వీధివీధిలో కేక వేస్తూన్నారు గాజులాయన—"గాజులమ్మో గాజులూ!... నలుపు, తెలుపు, ఎఱుపు, మెఱుపు, పసుపు, పచ్చ, నీలి, వసంతం...రకరకాలు! తళుక్ తళుక్‌మనే అందచందాలు!"

మలుపులోని రెండంతస్థుల మేడమీది కిటికీని కాస్త తెరిచి ఒక యువతి-మాలతి-పిలిచింది— "ఓ గాజులతాతా... గాజులతాతా! యిల్లా రా!"

గాజులాయన ఆగి, యిటుఅటూ చూస్తూ— ఎవరూ? ఎక్కడనుండి పిలుస్తూన్నారు?" అన్నాడు.

"మేము, యిక్కడనుండి."

"చిన్నారిముఖంతో అందమైన మాలతి ఎఱ్ఱంచుల చీరె కట్టుకొని నిలచియుంది. వెడల్పయిన సిల్కుచీర ఎఱుపంచు, కెంపులా మెఱుస్తోంది. ఆమె ముక్కుకు చంద్రవంక పుడకవుంది; చెవులకు పోడుల దుద్దులు, లోలక్కులు వున్నాయి. అవి, ఆమె ముఖవర్చస్సులో మిళితమైపోయియున్నై. ఆమెను చూడగానే వృద్ధుని హృదయం ప్రసన్నత కెందింది. ఇలాంటి సౌందర్యం అతడు యెప్పుడూ చూడలేదు. అనేక సుందరాంగులకు గాజులమ్మాడు కాని యెవరినీచూచి అతడి హృదయం యింత ప్రసన్నత కెందలేదు. తిన్నగావచ్చి మేడముంగిట నిలుచున్నాడు.

మాలతి మీదినుండి దిగి అతడియెదుట నిలుచుని—"ఎఱుపుగాజు లున్నాయి తాతా?" అంది.

"ఉన్నాయి లక్ష్మీ! ఎవరి చేతులకు కావాలి? నీకా?"

"ఆఁ." పైటను సవరిస్తూ అంది మాలతి.

భుజంమీది కావడిని కిందకుదించి పెట్టె కప్పుల్ని తీస్తూ—"నీ గులాబి చేతులకు ఎఱుపు గాజులు రాణించవు తల్లీ! రంగులో రంగు కలిసిపోతుంది. గులాబీచేతులకు నలుపుగాజులు చాలా బాగుంటాయి. నల్లగాజు లిచ్చేదీ?" అన్నాడు గాజులతను.

"లేదు, ఎఱుపులే తీయి." సిగ్గుతో ఎఱ్ఱబారి, నవ్వుముఖాన్ని క్రిందకుతిప్పి అంది మాలతి.

"నాతల్లీ, ఎఱుపుకు భక్తురాలవా! ఏదీ, నీ చేతులు చూపమ్మా." నవ్వుతూ అన్నాడు ముసలాడు.

"లేదు, నీవు గాజుల్ని యివ్వు, నేను చూసుకుంటాను."

"నీచేతులకు తొడిగిస్తా నేగదు, లక్ష్మీ!"

"లేదు, మాఅమ్మచేత తొడిగించుకుంటాను."

"లేదమ్మా, యిలా కాబోదు, ఈగులాబీ చేతులకు ఎఱ్ఱగాజులు తొడిగించి వెళ్తాను నేను. తొడిగించనీయకపోతే గాజుల్ని అమ్మను."

ఈ వృత్తితో, ఎన్నోయిళ్ళల్లో, ఎందరో స్త్రీలచేతుల్ని తన చేతుల్లోనికి తీసుకొని గాజుల్ని తొడిగించాడు. ఎన్నోస్పర్శలు తనను క్షణమాత్రం కొస్తాచలింపజేసాయి, కాని ఏదీకూడా తననుముగ్ధుణ్ణి చేయలేకపోయాయి. నే డతనికి తట్టింది—యీ లావణ్యవతి చేతులకు గాజుల్ని తొడిగించలేకపోతే యీ వృత్తి నిష్ఫలము, ఈ చేతుల్ని కనుగొనడం కోసమే, జీవితమంతా ఎండలో, వీధివీధిలో తిరిగి, యింటింటా వెదకి కాలాన్ని గడిపాడు— నల్లని జుత్తును, తెలుపు చేసేశాడు. అంచేత మాలతి అతడి చేత గాజుల్ని తొడగనంటే అన్నాడతడు—“తొడిగించనీయకపోతే గాజుల్ని అమ్మను.”

ఈమాటవల్ల మాలతి చాల సిగ్గుపడ్డది. మరేమీ అనక మెల్లిమెల్లిగావచ్చి వృద్ధునిదగ్గఱ కూర్చుని అందమైన కోమలమగు చేతిని అందించింది. ఆమె సిగ్గులో మోహనత్వం మెఱసిపోతోంది.

వృద్ధుడు, కమలాల్లాంటి ఆమెచేతిని తన చేతుల్లోనికి తీసికొని హృదయస్నేహపు ఆవేగంతో ఒకమారు నొక్కి గాజులకొలతను తీసుకున్నాడు. ఈ దివ్యమైన పుష్పకరులకు కన్నీటితో కడిగి, వింత చుంబనాలతో నింపి, గాజుల కావిడిని విడిచి తిరిగిపోతే ఉచ్ఛ్వాసపూరిత స్నేహపుటావేగం కొస్తా ఆనందపడగలదనుకొన్నాడు.

ఆమె రెండుచేతుల్ని తనచేతుల్లో పట్టుకొని ఒక్కొక్కటిగా ఎఱుపు గాజుల్ని తొడిగించసాగాడు. నొప్పిచే మాలతి ముఖం కొస్తా ముడుచుకుపోతే ఆబాధ వెయ్యిరెట్లయి అతడి హృదయానికి తగులుతోంది.

“చాల నొప్పికొట్టుతూందాయేం, తల్లీ! కొస్తా సహిస్తే గాజులు చేతులకు యెక్కిపోతాయి. చాల అందంగ కనబడతాయి...”

మాలతి కళ్లు చెమ్మగిల్లాయి. అయినా వృద్ధుని మాటలు విని ఎఱుపుబారిన బిడియపుముఖాన్ని కూది కత్తి మందహాసంచేసింది. ఆ హాసంకలన బుగ్గలపైని లొత్తలుపడ్డాయి.

గాజుల్ని తొడిగించి, అమ్మకానికి తెచ్చిన బొమ్మలుసైతం మంచిమంచివి ఏర్చియేర్చి పెట్టెనుంచి తీసాడు వృద్ధుడు.

అవిచూచి—“ ఇవన్నీ నాకక్కరలేదు ” అంది మాలతి.

“నీకు అక్కరలేకపోతే పిల్లలకు యివ్వు తల్లీ!” నవ్వుతూ అన్నాడు వృద్ధుడు.

సిగ్గుతో తలవంచుకుంది మాలతి.

ఆమె అత్తగారు అక్కడే నిలచియుంది. నవ్వుతూ అందుకుందానిద—“కోడలికి యింకా పిల్లలుపుట్టలేదుకదూ, అంచేత యివి అవుసరంలేదు!”

“పోనీయండి, నా తల్లి ఆడుకుంటుంది.” పెట్టెల్నిమూసి కావడిలో పెడుతూ అన్నాడు గాజులాయన.

“వీటన్నిటి వెల యెంత?” అడిగింది అత్తగారు.

“ఇవన్నీ నేను నాతల్లికి యిస్తాను.”

“ఏమేంమాట! నాకేమీ [illegible]

కు, ఉంచండు, మామ్మ తీసికెళ్లు...”

అప్పటికే యింటినుంచి వీధిలోనికి వెళ్ళిపోయి గాజులమ్మా గాజులూ!...ప్రసన్న హృదయంతో కేక వేస్తూన్నాడతడు—“నలుపు, తెలుపు, ఎఱుపు, మెఱుపు, పసుపు...”

ఆనాటినుండి గాజులాయన ప్రతిరోజూ మధ్యాహ్నం, ఆమలుపులో గాజులమ్మ రాసాగాడు. గాజులు నిత్యావశ్యకమైన వస్తువులుకావు. అంచేత మరెవ్వరూ పిలవరతణ్ణి. కాని, అతడికేక వినగానే మాలతి ఒకమారు కిటికీ దగ్గఱకువచ్చి నిలుచుంటుంది. ముసలాయన తలెత్తి ఆమెను ఒకమారు చూచేవాడు. ఇద్దరు కళ్ళను నాలుగుచేసి, దినంలోని క్షణమాత్రపు మేటి పరిచయ స్నేహసంబంధాన్ని బిడియమిళితమగు చిరునగవులతో స్వీకరించేవాళ్లు.

“మాలతి, మీతాతగారు వచ్చారా! తెల్లని గడ్డాంగల మీ తాతగారు చాలగొప్పవారు!” అనేది అత్తగారు.

ఆనందంతో బిడియంగా ఒక చిరునవ్వు విసరి కిటికీనుండి కదలిపోయేది మాలతి.

గాజులాయన తలచేవాడు—తను గాజులమ్మడం మానేసి, కూరగాయలు, లేక కిరసను నూనె అమ్మితే మాలతి యింటికి వెళ్ళివచ్చే అవకాశం దొరకున్ను. కాని, గాజులమ్మకపోతే, కమలాల్లాంటి ఆ చేతుల్ని రెండుచేతుల్లో నొక్కి హృదయంయొక్క నిండు ఆనంద స్నేహతరంగాలు విడిచే తరుణం లభించదు. భవిష్యత్తులోని సుయోగపు ఆశతో వృద్ధుడు గాజులకావిడిని భుజంపై నుంచుకొని మధ్యాహ్నపు మండుటెండలో వీధివీధి తిరిగి కేక వేస్తాడు--"గాజులమ్మా గాజులూ!..."నలుపు, తెలుపు, ఎఱుపు, మెఱుపు......"

కొన్నిదినాల తరువాత, హఠాత్తుగా మాలతి, కిటికీవద్దకువచ్చి నిలుచుండడం మానివేసింది. ముసలాయన అరచీ అరచీ అలసి తిరిగిపోయేవాడే కాని ఆ దివ్యముఖం బిడియపు మందహాసంతో కళకళలాడుతూ కిటికీవద్ద మరి కనబడేదికాదు. ఒక దీర్ఘ నిట్టూర్పువిడిచి బదులుగా ఒకమారుకిటికీవైపుచూచి మరలిపోయేవాడు. కాని, మనస్సు, మరలడానికి అంగీకరించదు. కాళ్ళు కదలవు.

కొన్నిరోజులు వ్యర్థప్రతీక్షతో తిరిగితిరిగి అనేకమార్లు అరచినాకూడా ఆ కిటికీవద్ద ఆ ముఖం కనబడకపోగా ఒకనాడు సాహసంచేసి గేటువద్ద నిలుచుని కంఠం పెద్దదిచేసి అడిగాడు—

"అమ్మగారూ, గాజులు కావాలా?"

"వద్దు." ఇంటినుండి ఒక స్త్రీకంఠం జవాబిచ్చింది.

ఒక నిరాశా నిట్టూర్పు విడిచి కొంతసేపు స్తబ్ధుడై నిలుచున్నాడు. మళ్లీ మెల్లగా ముందుకువెళ్ళి ముంగిటనిలచి భయపడుతూ అడిగాడు—

"అమ్మగారూ, నాతల్లి యెక్కడుంది?"

"ఇక్కడలేదు." స్త్రీకంఠం మళ్ళీ లోనుండి జవాబిచ్చింది.




# తలకట్టు

భాగ్యములలోకెల్ల భాగ్యమగు మీ మెత్తని తలవెంట్రుకలను కేశవర్ధిని నుపయోగించి మీ ముఖ్యాలంకారముగా చేసికొనవచ్చును.

గడ్డము, ముక్కు మొదలగు ముఖనిర్మాణము మార్చుకోలేరుగాని కేశకలాపమును మాత్రము, అజంతా చిత్తరువులట్లు యథేచ్ఛగా చిత్రించుకొనవచ్చును.

ప్రతినిత్యము మీ అలంకారమునందు, కేశవర్ధిని మీ కేశముల నలంకరించుటతో నారంభించుచు మీ శృంగారమునకు దోహద మొసంగనిండు. తేజస్వనమును మోహనమునగు మీ కేశబంధమును కేశవర్ధిని బలమునిచ్చి పెంచును.

# కేశవర్ధిని

నేడే మీ కురులకు కేశవర్ధిని వాడుడు కురులనుఅందముగా పెంచి బలపర్చును.

కేశవర్ధిని అ. 14, కేశవర్ధిని సాంపూ అ. 14.
ప్యాకింగ్, పోస్టేజి అధికము.
వర్తకులందరియొద్ద దొరకును, లేక

సౌత్ ఇండియా కెమికల్స్,
ఆర్. ఎస్. పురం, : : కోయంబత్తూరు.

వందలకొలది ప్రశ్నలు వేయ ఆత్రుత జనించినా సాహసం కలగలేదు. మెల్ల మెల్లగా బయటకు నడక మందగించింది. వీధిలో మరి "గాజులమ్మా, గాజులూ!" అని కేక వేయలేదు.

ఇక్కడలేదు. ఎప్పుడొస్తుంది? తెలీదే తెలీదు. ప్రతిదినం ఆశతో వచ్చి ఆ వీధిలో పెద్దగా కేక వేస్తాడు—"గాజులమ్మా, గాజులూ!......

"ఒకమారు, రెండుమార్లు, మూడుమార్లు! ఇక శూన్యమగు ఆ కిటికీవైపు కళ్ళతో చూచి నిట్టూర్చి వెళ్ళిపోతాడు. మరునాడు మళ్ళీవస్తాడు.

ఇలా కొన్ని నెలలు గడిచిపోయాయి. పర్వదినాలు వచ్చాయి. గాజుల్నిగానే అలజడి యింటింటా రేగింది. యువతులు, గృహిణులు, బాలికలూ అందరూ తమ తమ మనస్సుకు నచ్చిన గాజుల్ని ఏర్చి యేర్చి తొడుగుకొంటున్నారు. గాజులాయన, వాళ్ళ చేతుల్ని తన చేతుల్లోనికి తీసుకొని గాజుల్ని తొడిగిస్తూన్నారు. కాని అతని మనస్సు ఏవిధంగానూ ప్రసన్నత జెందలేదు. అతడికి శాంతి లభ్యమవలేదు. అతడి తల్లిలాంటి దివ్యకరాలు ఎవరికీ లేవు. అలాటి సున్నితమైన ముంజేతులు, ఎవరికీ లేవు. ఆమోస్తరు మధురమైన మాటలు, మందహాసాలు ఎవరికీ లేవు.

ప్రతీక్ష చేసీచేసీ, అలసిపోయి ముసలాయన మళ్లా ఒకనాడు ఆ యింటి యెదుట తిరుగుతూ మాటి మాటికీ కేక వేయసాగాడు — "గాజులమ్మా, గాజులూ!— నలుపు, తెలుపు..." కాని, ఎవ్వరిది జవాబు రాలేదు. ఎవ్వరూ కిటికీనుండి పిలవలేదు-- "ఓ గాజులతాతా ... గాజులతాతా!...యిల్లా రా!" అని ఆ కిటికీ అలానే శూన్యం, నిరానందం!

అప్పుడు మెల్లగ ముందుకుపోయి ముంగిట నిలుచుని కేక వేశాడు—"గాజులు తీసుకుంటారా, అమ్మగారూ?"

ఒక దాసీది దిక్కయి తీక్ష్ణస్వరంతో జవాబిచ్చింది—"లేదండీ, లేదు. లక్షమార్లు చెప్పాం గాజులక్కరలేదని. అయినా దిక్ గావించడానికి వస్తావు. అవసరమైతే వీధినుండి పిలుస్తాం."

భయ బిడియాలతో చిన్నబోయి, దొంగలా అతడు తిరిగిపోతూంటే మాలతి అత్తగారు బయటకొచ్చింది. ఆవిడను చూచి గారాభపడి—"అమ్మగారూ నాతల్లి యిప్పటివరకూ రాలేదా యేం?" అడిగాడు.

"వచ్చింది." మలిన ముఖంతో, ఉదాసీనతతో అతడివైపు చూచి అందావిడ.

"అయితే, అమ్మగారూ, ఆమెను ఒకమారు చూడలేనా? చాల దినాలనుండి నాతల్లిని చూడలేదు. చూడడానికి వచ్చి వెళ్ళిపోతూన్నాను. కాని చూడలేకుంటున్నాను." ఆనందపూరిత స్వరంతో అన్నాడు ముసలి గాజులతను.

ఆవిడ కొంతసేపటివరకూ స్తబ్ధురాలై నిలుచుంది. చూస్తూండగా ఆమె కళ్ళనుండి టపటప మని నీరు కారసాగింది.

"నేను బాబూ, మీ తల్లిని మరి చూడలేరు!"—కళ్ళను తుడుచుకుంటూ స్థిరకంఠంతో అందావిడ.

ముసలాయన ఆనందోజ్వల ముఖం పూర్తిగ ప్రభాహీనమై ఆరిపోయింది. వ్యధిత కన్నీటి పూరితమగు దృష్టితో ఆవిడవైపు చూచి, నిరాశామానసంతో, శోక అనిచ్ఛుకమైన కాళ్ళను తీసి తిరిగాడు. ఈ పండుగ సమయంలో బజారంతా గాలించి అన్నిటికన్నా మంచివైన ఒక జత గాజుల్ని తెచ్చాడు తన తల్లి చేతులకు తన చేతులతో తొడిగించడానికి. కాని, యెక్కడ ప్రేమించ అధికారముందో, అక్కడ ముందే అధికారం లేదు. అక్కడనుండి యెలా కదలుతాడు—ఒత్తిడి చేస్తాడు? మాలతి తన కుమార్తె అయియుంటే ఆమె అత్తగారు యిలా తన్ను నిరాశా దుఃఖాల్లో ముంచి పంపించి యుంటేదా? పెద్ద నిట్టూర్పు విడిచి రాలుతున్న అశ్రుపుల్ని కొంగుతో తుడిచేశాడు. గేటువరకూ మెల్ల మెల్లగా వెళ్ళి చటుక్కున నిలుచున్నాడు. ఒకమారు మెడతిప్పి చూచాడు. మంచ

గమనంతో, తడబడే అడుగులతో మరలి బయట నిలుచున్నాడు.

మాలతి అత్తగారు అలానే అప్పటికీ అరుగు మీద నిలిచియుంది. చేతులు జోడించి, వంగి మళ్లా అన్నాడు ముసలాడు—"అమ్మగారూ, నేను గాజుల్ని అమ్మడానికి రాలేదు. ఒకమారు నా తల్లిని చూసి వెళ్తాను......"

ఇదంతా వింటూంటే అతడి కళ్ళనుండి వేదనా మిళితమగు వినయాశ్రువులు కారసాగాయి.

కోడల్ని ఒక ఆత్మీయ వ్యక్తి ఎదుటకు తేవడంలో అడ్డువచ్చే ఆటంకాన్ని వృద్ధ గాజులాయన అశ్రువులతో అంతవరకూ తుడిచేసాడు. అతడితో మాలతి హృదయ బాంధవ్యాన్ని ఒక క్షణంలో అశ్రువులు ఋజువు చేసాయి. అత్తగారు ఒక్క క్షణం అతడివైపు చూచి, రెప్పలతో కదలే కన్నీటి బిందువుల్ని తుడిచి, గద్గదస్వరంతో దాసితో అంది "లచ్చీ, కోడల్ని ఒకమారు యిలా పంపు."

మాలతి మెల్ల మెల్లగా, సంకుచిత, జడితాడుగులతో గాజులాయన యెదుటకు వచ్చి నిలుచుంది. గాజులాయన ఆనందభరిత మొఖంతో జేబునుండి ఒక కాగితపు పొట్లాను తీసి విప్పి ఒక జత విచిత్రపు రంగుగల గాజుల్ని అందులోనుండి తీసి—"అమ్మా చూడు, నీ గురించి "జూబిలీ" గాజుల్ని తెచ్చాను!" అన్నాడు.

తరువాత నవ్వు ముఖాన్ని పైకెత్తి మాలతి చేతికి వాటిని అందిస్తూ అమాంతంగా నీరవుడై పోయాడు. మాలతి చేతుల్లో ఏ అలంకారణాలేదు. గులాబీ చేతుల్లోని తన అమేటి శోభగల ఎఱుపు గాజుల్ని విరిచేసుంది. ఆ చీర ఎఱుపంచు మెఱవటం లేదు. నుదుట తిలకం తుడిచివేసుంది. కాళ్ళకు ఎఱ్ఱపారాణి లేదు. పెదవులపై తాంబూలపు ఎఱుపు లేదు. ముక్కులో పుడక లేదు. చెవుల్లో ఆముద్దుగొల్పే దుద్దులు, లోలక్కులూ లేవు. ముఖంలో ప్రపంచాన్ని మరపించే మందహాసం కూడా లేదు! ఒక సాధారణమైన అంచులులేని తాను—జాజి పూలాంటి తెల్లని దివ్యమైన, కానీ, మలినమైన మూర్తిని సంకుచిత పరచి అసహ్యంగా వుంది. ఈ మూర్తిని చూడగానే ముసలాయన చేతిలోని గాజులు జారి కింద పడిపోయాయి. ఆ విరిగిన గాజుల్లా పగిలిన హృదయాంతరాళం నుండి పెనువిషాదంతో ఏడ్చి రెండుచేతులతో కళ్లుమూసుకొని అన్నాడు—"అయ్యో తల్లీ, యిదేం చూచాను నేను? దీనికి ముందుగా ఎందుకు పోయాను కాను!"

మాలతి తల కిందకు దించి మెల్లగా అక్కడనుండి వెళ్లిపోయింది. ఆవిడ అత్తగారూ కళ్లు తుడుచుకుంటూ గదిలోకి కదలిపోయింది. విచ్ఛిన్నమగు హృదయంతో దుర్బలమై వణికే చేతులతో కావడి ఎత్తితడబడుతూ బయటకు వచ్చేశాడు గాజులాయన.

మీరు చాలరోజులు వెదకిన
పుస్తక మిదియే!

కొక్కోకము

స్త్రీ పురుష రహస్యములు 24 చిత్రపటములతో 130 పేజీలుగల పెద్ద పుస్తకము ధర రు. 1-8-0. పోస్టుఖర్చు రు. 0-6-0. ఇందులో స్త్రీ పురుష శృంగార రహస్యములు గలవు. ముందుగా డబ్బు రు. 1-14-0 మణిఆర్డర్ చేయవలెను. వి. పి. లేదు.

జైహింద్ బుక్ డిపో,
అరుణాచల మొదలి వీధి,
18, బీటు, మద్రాసు.